బాటసారులకు బాసట

మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీరుస్తున్న చలివేంద్రాలు

స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు

వేసవి తాపం రోజురోజుకూ తీవ్ర ప్రతాపం చూపుతోంది. మార్చి మొదటి వారం నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఇంటి నుంచి బయటకు వద్దామంటే భానుడు భగభగలాడుతూ భయపెడుతున్నాడు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు దాహార్తితో ఇబ్బంది పడకుండా పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు ముందుకొచ్చాయి. మండుటెండలో బాటసారులకు బాసటగా నిలుస్తున్నాయి. వేసవి ప్రారంభమైన నాటి నుంచి పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ చల్లని మజ్జిగ, తాగునీరు అందిస్తూ వేసవి తాపం నుంచి ఉపశమనం కల్పిస్తున్నారు.

- మద్దిలపాలెం



కృష్ణా కళాశాల జంక్షన్ వద్ద చలివేంద్రంలో దాహార్తి తీర్చుకుంటున్న విద్యార్థినులు

జీవీఎంసీ ఆధ్వర్యంలో..



మద్దిలపాలెం బస్టాప్ వద్ద జీవీఎంసీ చలివేంద్రం

జీవీఎంసీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం బస్టాప్, కళాభారతి జంక్షన్, ఇసుకతోట సిగ్నల్ వద్ద రెండు వైపులా, వెంకోజీపాలెం కూడలి, హనుమంతవాక సిగ్నల్, శివాజీ పార్కు, ఎంవీపీ ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో ఒక మనిషిని పెట్టి గ్లాసుల ద్వారా బాటసారులకు మంచినీరు అందిస్తున్నారు.

కొత్త వెంకోజీపాలెం గ్రామ సంఘం..



వెంకోజీపాలెం బస్టాప్ వద్ద ప్రారంభించిన మజ్జిగ చలివేంద్రం

కొత్త వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం, సద్గురు సాయినాథ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకోజీపాలెం బస్టాప్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీని ద్వారా రోజుకు 300 మందికి ఉచితంగా మజ్జిగ అందిస్తున్నారు. వేసవిలో మూడు నెలల పాటు చలివేంద్రాన్ని కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పాదచారులు, వాహన చోదకుల హర్షం

బస్టాప్‌ల వద్ద వేచి ఉండే ప్రయాణికులతో పాటు పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులకు వేసవి తాపం నుంచి చక్కని ఉపశమనానికి చలివేంద్రాలు ఎంతో దోహదపడుతున్నాయి. జీవీఎంసీతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేసి పంపిణీ చేయడంపై వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులకు వడదెబ్బ తగలకుండా ఇవి రక్షణగా నిలిస్తున్నాయని చెబుతున్నారు. స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ప్రతినిధులు మండువేసవిలో అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేసి అందరి మన్ననలు పొందుతున్నారు.

శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో..



మద్దిలపాలెం బస్ స్టేషన్ వద్ద సత్యసాయి సేవా సంస్థ ఏర్పాటు చేసిన చలివేంద్రం

శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో 35 ఏళ్లుగా ప్రతి వేసవిలోనూ ఈ తరహా సేవలు అందిస్తున్నారు. వేసవి ప్రారంభం కావడంతో నగర పరిధిలో సుమారు 35కి పైగా చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రత తగ్గుముఖం పట్టే వరకు ప్రతి రోజూ చల్లని మజ్జిగ, రక్షిత తాగునీరు అందిస్తున్నారు. ఒక్కో కేంద్రం ద్వారా రోజుకు 1,800 నుంచి 2,500 మందికి మజ్జిగ అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. సత్యసాయి సేవా సంస్థలకు సంబంధించి అన్ని విభాగాల ప్రతినిధులతోపాటు వారి కుటుంబ సభ్యులు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొంటున్నారు. నగరంలోని మద్దిలపాలెం బస్ స్టేషన్, ఉషోదయ జంక్షన్, ఎంవీపీ రైతుబజార్, రామ్‌నగర్, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో చలివేంద్ర కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు.

గురు విశ్వస్ఫూర్తి సంస్థ..



మద్దిలపాలెం ఏయూ గేటు వద్ద గురు విశ్వస్ఫూర్తి సంస్థ చలివేంద్రం

గురు విశ్వస్ఫూర్తి సంస్థ ఆధ్వర్యంలో మద్దిలపాలెం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రవేశ మార్గం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. వెంకోజీపాలెం వద్ద మరో చలివేంద్రం ఏర్పాటు చేసి మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్నారు. చలివేంద్రాల వద్ద ఇద్దరు వ్యక్తులు దాహార్తులకు తాగునీటిని గ్లాసులతో అందిస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా షిర్డీసాయి మందిర వార్షికోత్సవం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మాజీ మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు బాలాజీనగర్‌లోని షిర్డీసాయిబాబా మందిర వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా షిర్డీసాయిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. జీవీఎంసీ మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, టీడీపీ, బీజేపీ నాయకులు ఒమ్మి సన్యాసిరావు, ముగడ రాజారావు, మధుపాడ సన్యాసిరావు తదితరులు బాబాను దర్శించుకున్నారు. మందిరం వద్ద మధ్యాహ్నం కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. హరివెంకటకుమారి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. బాలాజీనగర్, అన్నానగర్, డ్రైవర్స్ కాలనీ, బీసీ కాలనీ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని సాయి ప్రసాదం స్వీకరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

ఆరిలోవ: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ తోటగరువు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం ర్యాలీ చేపట్టారు. పాఠశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ తోటగరువు కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఒత్తిడి లేని చదువు, నాణ్యమైన విద్య అందిస్తారని తెలిపారు. ఒకటో తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం నేడు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-2 పరిధి 5, 6, 7, 8 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాలకు శనివారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8 వార్డుల పరిధిలో తాగునీరు సరఫరా చేసే ప్రధాన వనరు గోస్తనీ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద తాగునీటిని పంపింగ్ చేసే ప్రధాన పైప్‌లైన్ పంప్ హౌస్ వద్ద, మారికవలస మెట్రో హోల్‌సేల్ ఎదురుగా లీకులకు గురి కావడం వల్ల మరమ్మతుల కారణంగా శనివారం నీటి పంపింగ్ జరగదన్నారు. 5వ వార్డు బోరవానిపాలెం, సాయిరాం కాలనీ, 6వ వార్డు కొమ్మాది విలేజ్, ఎంఎస్ఆర్ లేఅవుట్, సాయిప్రియ లేఅవుట్, సంపత్‌నగర్, లక్ష్మీవానిపాలెం, ఎస్సీ కాలనీ, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం, పీఎం పాలెం, అశోక్‌నగర్, తులసీనగర్, 7వ వార్డు చంద్రంపాలెం, కళానగర్, కృష్ణానగర్, ఎన్జీవోస్ కాలనీ, 8వ వార్డు మిథిలాపురి వుడా కాలనీ, పాత మధురవాడ, ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీ, షిప్‌యార్డ్ లేఅవుట్, బింద్రానగర్, తారకరామ నగర్, చాణిక్యపురి లేఅవుట్, పియర్‌లెస్ కాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయడం ఏర్పడనుందని తెలిపారు. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఉచిత సంగీత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



తాటిచెట్లపాలెం: స్థానిక మాస్టర్ ఇ.కె. సంస్కృతీ సదన్ సంగీత జనకులం ఆధ్వర్యంలో ఉచితంగా కర్ణాటక సంగీతం, గాత్ర, వాయిద్య సంగీతం, వేదాభ్యాసాలలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంగీత జనకులం అధ్యక్షుడు ఇంద్రగంటి కాశీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతులలో చేరదలచుకున్నవారు ఏప్రిల్ 27వ తేదీ ఉదయం 9 గంటలలోగా సంప్రదించాలని కోరారు. మొత్తం నాలుగు విభాగాలుగా ఈ శిక్షణ ఉంటుందన్నారు. చేపట్టనున్నారు. మొదటి విభాగంలో సంవత్సరం శాస్త్రీయ సంగీత అవగాహన తరగతులు, రెండవ విభాగంలో వాయిద్య సంగీతం, వేణుగాన సంగీత శిక్షణ, మూడవ విభాగంలో ఐదు సంవత్సరాల గాత్ర, సంగీత తరగతులు, నాలుగవ విభాగంలో వేదాభ్యాసంలో భాగంగా మాస్టర్ ఇ.కె. అందించిన నిత్య షోడశోపచార పూజా విధానంలోని ఋగ్వేద సూక్తాలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు సంస్కృతి సదన్ సంగీత జనకులం కార్యాలయంలో స్వయంగా గానీ లేదా 93983 14502 నంబర్‌లో గానీ సంప్రదించాలని కోరారు.

'డీఎస్సీ'లో గిరిజన నిరుద్యోగులకు అన్యాయం

ఎంవీపీకాలనీ: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో గిరిజన నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ఈ అంశంపై ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో శుక్రవారం సమావేశమై చర్చించారు. గిరిజన యువతకు లబ్ధి చేసే జీవో నంబర్ 3ని పునరుద్ధరించకుండా, ప్రత్యామ్నాయ జీవో కూడా విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. దీంతో అత్యంత వెనుకబడిన గిరిజన కులాల నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పునరాలోచించి గిరిజన యువతకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు సోనాయి అప్పలరాజు, కార్యదర్శి శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాతలకు బాండ్‌లు అందిస్తున్న దేవస్థానం ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ముగ్గురు దాతలు చెరో రూ.లక్ష చొప్పున రూ.3 లక్షల విరాళమిచ్చారు. విశాఖ సాగర్‌నగర్‌కు చెందిన కొల్లి శివకాంత్, ముంబైకి చెందిన పీయూష్ రఘువన్షి, అభినవ్ చతుర్వేదిలు ఒక్కొక్కరు ఒక్కో రూ.లక్ష చొప్పున ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతలకు అన్నప్రసాద విభాగంలో ఏఈవో పి.శ్రీనివాసరావు బాండ్‌లు అందించారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు.

ఉగ్రదాడిలో అమరులకు ముస్లింల కన్నీటి నివాళి



చినవాల్తేర్ మసీదు వద్ద మృతులకు నివాళులర్పిస్తున్న ముస్లింలు



ముస్తఫా కాలనీ మసీద్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

ఏయూక్యాంపస్: కశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో అసువులు బాసిన వారికి శుక్రవారం చినవాల్తేర్‌లోని మహమ్మదీయ మసీదు వద్ద ముస్లింలు కన్నీటి నివాళులర్పించారు. ఉగ్రవాదుల దారుణ మారణకాండను ఖండించారు. అమరుల పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. తీవ్రవాదం నశించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

ఆరిలోవలో ముస్లింల నిరసన

ఆరిలోవ: పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా ముస్లింలు నిరసనలు తెలుపుతున్నారు. జీవీఎంసీ 12వ వార్డు ముస్తఫా కాలనీలోని అస్జీద్ అహలే హదీస్ మసీదులో నమాజ్ చేసిన ముస్లింలు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని ఉగ్రదాడిని ఖండిస్తూ నినాదాలు చేశారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళుర్పించారు.

చంద్రమౌళికి దివ్యాంగ విద్యార్థుల శ్రద్ధాంజలి

ఎంవీపీకాలనీ: ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన విశాఖ వాసి చంద్రమౌళికి ఎంవీపీ కాలనీ సెక్టార్-12లోని హిడెన్ స్ప్రౌట్స్ దివ్యాంగ విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గతంలో బ్యాంకర్స్ విశ్రాంత ఉద్యోగుల తరఫున చంద్రమౌళి హిడెన్ స్ప్రౌట్స్ పాఠశాలకు అనేక రకాలుగా సహాయం అందించినట్లు పాఠశాల నిర్వాహకుడు శ్రీనివాస్ తెలిపారు. ఆయన మృతి పాఠశాలకు, దివ్యాంగ విద్యార్థులకు తీరని లోటన్నారు.

అమాయకులపై ఉగ్రదాడులు శోచనీయం



ఏయూలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న విద్యా విభాగాధిపతి షారోన్‌రాజు, ఆచార్యులు, విద్యార్థులు

విశాఖ విద్య: ఉగ్రవాదంతో దేశ భద్రతకు ముప్పు వస్తుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు అన్నారు. కశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో అసువులు బాసిన వారికి శుక్రవారం విభాగంలో విద్యార్థులతో కలిసి ఆయన కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అమాయకులైన పర్యాటకులపై ముష్కర మూకలు విరుచుకుపడటం, ప్రాణాలను హరించడం శోచనీయమన్నారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ మౌనం పాటించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఇటువంటి చర్యలకు తగిన గుణపాఠం, సమాధానం చెప్పాలన్నారు. ప్రజలంతా ఐక్యంగా ఉంటూ మృతుల కుటుంబాలకు బాసటగా నిలిచి మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు డాక్టర్ ఆలీ, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ సాల్మన్, డాక్టర్ రాము విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కులోని కోర్టు-2లో నిర్వహించిన పైడిరాజు మెమోరియల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. విజేతలుగా ప్రసాద్, మహేష్ జట్లు.. రన్నర్స్‌గా ఎం.రంగారెడ్డి, నాగభూషణరావు జట్లు నిలిచాయి. గ్రౌండ్లో ఉన్న మూడు షటిల్ కోర్టుల ఆటగాళ్లతోపాటు కొత్త వెంకోజీపాలేనికి చెందిన గణేష్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆటగాళ్లు పాల్గొని ప్రతిభ చూపారు. 15 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించి గురువారం లీగ్ మ్యాచ్‌లు ఆడించారు. శుక్రవారం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించి, విజేతలకు ట్రోఫీలు, జ్ఞాపికలు బహూకరించారు. ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ మొల్లి అప్పారావు పాల్గొని పైడిరాజు జ్ఞాపకార్థం కేక్ కట్‌చేశారు. పైడిరాజు స్ఫూర్తితో ఆటగాళ్లందరూ రాణించాలని ఆకాంక్షించారు. విన్నర్స్, రన్నర్స్‌కు ట్రోఫీలు, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఆటగాడికి మెడల్స్‌ను అప్పారావు అందజేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ తమ గురువు పైడిరాజు గతేడాది అకాల మరణం పొందారని, ఆయన నేర్పిన విద్యతో తాము ప్రతి రోజూ షటిల్ ఆటను కొనసాగిస్తున్నామన్నారు. నిర్వాహకులు పల్లా శ్రీను, పల్లా శివ, ప్రసాద్, ఒమ్మి కోటి, ఒమ్మి జగ్గారావు, శ్రీను, హరీష్, వంశీ, చిన్న, పల్లా ప్రసన్న, మహేష్, మణి, జనసేన నాయకుడు పీలా వెంకట పరదేశినాయుడు, శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు, మాజీ అధ్యక్షుడు పల్లా అప్పలరాజు, పల్లా చిన్నారావు, 16వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, శుభ్రం మేస్త్రి నమ్మి చిన్నరాజు పాల్గొన్నారు.

స్పెషల్ ఒలింపిక్స్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి, కలెక్టర్

విశాఖ విద్య: రాష్ట్రస్థాయిలో సమగ్ర శిక్ష పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన స్పెషల్ ఒలింపిక్స్ భారత్-2025 క్రీడా పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు ఏలూరు జిల్లా నూజివీడు మండలం ఆగిరిపల్లి హిల్ పారడైజ్ స్కూల్‌లో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తాచాటి పలు పతకాలు సాధించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వీరిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ హరేందిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్ అభినందించారు. సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ జె.చంద్రశేఖరరావు, సహిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ విద్యార్థులకు 100 శాతం ఉద్యోగాలు



మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల పరిధిలో పీజీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నామని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు పేర్కొన్నారు. సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'కెరీర్ ప్లానింగ్-ప్రొఫెషనల్ స్కిల్స్ ఫర్ సోషల్ వర్క్ స్టూడెంట్స్' అనే అంశంపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగిస్తూ వందేళ్లు పూర్తి చేసుకున్న విశ్వ కళాపరిషత్ లక్షలాది మంది విద్యార్థులను జాతికి అంకితం చేసిందన్నారు. పూర్వ విద్యార్థులే వర్సిటీకి తరగని సంపదగా అభివర్ణించారు. సోషల్ వర్క్ పూర్తి చేసిన విద్యార్థులకు అనేక విభాగల్లో ఫెలోషిప్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సుమారు పది రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి ఫెలోషిప్‌లు కూడా ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ రాములు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజం నిర్మిద్దాం



మలేరియా నివారణపై అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్

సీతమ్మధార: మలేరియా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జీవీఎంసీ వద్ద జరిగిన అవగాహన ర్యాలీ, ఎగ్జిబిషన్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సిబ్బంది కృషితో 2023 కంటే 2024లో మలేరియా పాజిటివ్ కేసుల ఉధృతి తగ్గిందని, 2025లో మలేరియా కేసుల సంఖ్య మరింత నియంత్రించాలని కోరారు. ఇందుకు ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ప్రజలను మలేరియా నియంత్రణ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ కె.వి.ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ మలేరియా నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి 2027 నాటికి ఈ వ్యాధిని నిర్మూలించే దిశగా ప్రతి ఒక్కరు శ్రమించాలన్నారు. జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా వారానికి ఒకరోజు శుభ్రపరిచేలా చూడాలన్నారు. ఏఎంవోహెచ్ డాక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ మలేరియాపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా మలేరియా జ్వరాన్ని వ్యాప్తి చేసే దోమలు పెరిగే ప్రదేశాలు, వాటి నిర్మూలనకు ఉపయోగించే కెమికల్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. అనంతరం మనతోనే మలేరియా అంతం అంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మలేరియా జోనల్ కార్యాలయ సిబ్బంది, సబ్ యూనిట్ కార్యాలయం సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

తీరంలో శునకాల బెడద



బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై సేదతీరుతున్న శునకాలు



కురుసుర మ్యూజియం వద్ద సంచరిస్తున్న కుక్క



యోగా విలేజ్ ఎదురుగా ఫుట్‌పాత్ మీద శునకం

ఏయూక్యాంపస్: సాగర తీరంలో శునకాల బెడద పెరిగిపోతోంది. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో బీచ్ రోడ్డులోకి వాకింగ్‌కు వచ్చే వారిని ఇవి భయపెడుతున్నాయి. పదుల సంఖ్యలో కుక్కలు బీచ్ రోడ్డు వెంబడి దర్శనమిస్తున్నాయి. స్వేచ్ఛగా ఫుట్‌పాత్‌పై సేదతీరుతూ నిత్యం కనిపిస్తున్నాయి. వీటిని చూసి పిల్లలు, వృద్ధులు భయపడుతున్నారు. రాత్రి వేళల్లో బీచ్ రోడ్‌లో పర్యాటకులు తిని వదిలేసిన ఆహార పదార్థాలను తినడానికి ఇక్కడకు వస్తున్నాయి. కొంత మంది వీటికి ఆహారం పెడుతుండటంతో ఈ ప్రాంతంలో ఇవి ఉండిపోతున్నాయి. సాయంత్రం వేళల్లో ఫుట్‌పాత్‌పై ఉండే దుకాణాల వద్ద మిగిలిన ఆహార పదార్థాలు వీటికి ఆహారంగా మారిపోతున్నాయి. దీంతో శునకాలు ఇక్కడే తిష్ట వేస్తున్నాయి. ఉదయం వేళల్లో వాకింగ్ చేస్తున్న వారి మధ్యలో తిరుగుతూ ఇబ్బందికరంగా మారుతున్నాయి. వేసవి సెలవులు కావడంతో పెద్ద సంఖ్యలో చిన్నారులు సైతం ఉదయం వేళల్లో వాకింగ్‌కు వస్తున్నారు. జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి బీచ్ రోడ్డులో కుక్కల సంచారానికి అడ్డుకట్ట వేయాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.

సింహగిరిపై ఆర్జిత సేవలు పునఃప్రారంభం

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం నుంచి ఆర్జిత సేవలు పునః ప్రారంభమయ్యాయి. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం పురస్కరించుకుని ఈ నెల 7 నుంచి 24వ తేదీ వరకు ఆర్జిత సేవలు నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. కల్యాణోత్సవాలు విజయవంతంగా పూర్తి కావడంతో శుక్రవారం నుంచి తిరిగి ఆర్జిత సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి, ఉదయం 9.30 గంటల నుంచి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉభయదాతలకు స్వామి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. స్వామికి గరుడ సేవ విశేషంగా జరిగింది.